కలగానే డిగ్రీ కళాశాల..

- నియోజకవర్గంలో అందని ద్రాక్షగా గ్రాడ్యుయేషన్ విద్య
- హామీని అమలు చేయని పాలకులు
- దూరభారంతో ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులు



అప్పటి మంత్రి రామన్న, ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు (ఫైల్)



డిగ్రీ కళాశాల కోసం ఖానాపూర్‌లో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగులుతోంది. దీంతో సమీప ప్రాంతాల్లోని పేదవిద్యార్థులు ఇంటర్ పూర్తి చేసి చదువు మానేస్తున్నారు. ఎన్నికల వేళ ఆయా రాజకీయ పార్టీల నాయకులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి.. తర్వాత పట్టించుకోవడం లేదు.

ఖానాపూర్‌లో చదివేందుకు ఆసక్తి..

ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో ఇంటర్ పూర్తి చేసినవారు దూరభారంతో డిగ్రీ విద్యను అభ్యసించడం లేదు. మామడ మండలంలో ఇంటర్ చేసిన విద్యార్థులకు నిర్మల్ దూరం కావడంతో ఖానాపూర్‌లో చదివేందుకు మొగ్గు చూపుతారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్, మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు సైతం ఖానాపూర్ దగ్గరగా ఉంటుంది. రవాణా సౌకర్యం కూడా మెరుగ్గా ఉండటంతో ఇంటర్, డిగ్రీ చదివేందుకు వారంతా ఖానాపూర్‌కే వస్తారు. కానీ ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదు. ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి బాసటగా నిలవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆందోళనలు చేసినా స్పందించని వైనం...

ఖానాపూర్‌లో పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు మాత్రం ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆయా కళాశాలలకు పరీక్ష కేంద్రాలను సైతం కేటాయించింది. గతంలో జరిగిన పలు సభలు, సమావేశాల్లో ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాల నాయకులు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేసి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి అప్పటి సీఎం, విద్యాశాఖ మంత్రికి సమర్పించారు. అయినప్పటికీ ఖానాపూర్‌లో మాత్రం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ విద్య అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో లాభాలివీ..

ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే అందులో చదివేందుకు పేదవిద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. ప్రభుత్వ కళాశాలలో ఉండే ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో చేరడం ద్వారా ఆర్మీ, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌తోపాటు పోలీసు శాఖలో కొలువులు సులభంగా సాధిస్తారు. ఎన్ఎస్ఎస్ కేడెట్లు వివిధ ప్రాంతాల్లో నిర్వహించే క్యాంపులకు వెళ్లడం ద్వారా వారిలో లోకజ్ఞానం పెరుగుతుంది. ఉన్నత చదువులకు యూనివర్సిటీల్లో ప్రవేశం, ఉద్యోగాలు సాధించేందుకు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగపడతాయి.

పట్టించుకోని ప్రభుత్వం..



పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నాం. సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించాం. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం. – సునారికారి రాజేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

అసెంబ్లీలో ప్రస్తావించాం..



ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పా టు చేయాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించా. కళాశాల ఏర్పడితే నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యార్థులకు మేలు జరుగుతుంది. వారు డిగ్రీ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. మరోసారి ఈ అంశం సీఎం దృష్టికి తీసుకెళ్తా. – వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

కళాశాల ఏర్పాటు చేయాలి



ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల లేక ఎంతో మంది విద్యార్థులు చదువు మధ్యలో ఆపేస్తున్నారు. ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఉన్నత చదువుల్లో రాణిస్తాం. ఎన్‌సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకొని డిపార్ట్‌మెంటల్ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుంది. – సముండ్ల రాజ్‌కుమార్, ఖానాపూర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 220 కేవీ నిర్మల్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ముధోల్, తానూర్, కుభీర్ మండలాలతోపాటు భైంసా పట్టణం, రూరల్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వి ద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విని యోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద: విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మండలంలోని వడ్యాల్, నర్సాపూర్, రాచాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మహాలక్ష్మి ఆలయ ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీమహాలక్ష్మి ఆలయ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కడెం: మండలంలోని గంగాపూర్ పంచాయతీ పరిధిలోని దత్తోజీపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం శుక్రవారం ఆ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతంలో ఉన్న అటవీ గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఏడీఈ కొట్టి శ్రీనివాస్, ఏఈ విజయ్‌భాస్కర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'లక్కిడి'

నిర్మల్‌చైన్‌గేట్: నూతన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కిడి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సాయిబాబా చిత్రపటం అందజేశారు. నిర్మల్‌లోని గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ ప్రాశస్త్యం కలెక్టర్‌కు వివరించారు. బాబాను దర్శించుకునేందుకు రావాలని కోరారు.

కమలమ్మ సేవలు మరువలేనివి



కమలమ్మను సన్మానిస్తున్న డీపీఆర్వో

నిర్మల్‌చైన్‌గేట్: తమ కార్యాలయంలో సహాయకురాలుగా కమలమ్మ చేసిన సేవలు మరువలేనివని జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్వో) ఈ.విష్ణువర్ధన్ అన్నారు. గత నెల 30న ఉద్యోగ విరమణ పొందగా శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కమలమ్మకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జ్ఞాపిక అందించి శాలువాతో సత్కరించారు. కార్యాలయ సిబ్బంది సందీప్, నరేశ్, పుష్ప, జయలలిత, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది శోభారాణి, ప్రసన్న, కిరణ్, గంగారం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం

భైంసారూరల్: రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఉపాధ్యాయులు కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని మహాగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేపర్ సంచుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పేపర్ సంచుల తయారీ విధానం, వినియోగంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం దేవదాస్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, హరీశ్ ఉన్నారు.

బడిలో చేర్పించిన అధికారులు

నిర్మల్‌రూరల్: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బడి మానేసిన ఇద్దరు పిల్లలను శుక్రవారం అధికారులు బడిలో చేర్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కొండాపూర్ పాఠశాలలో ఆరో తరగతి, నాలుగో తరగతిలో ఒక్కొక్కరిని చేర్పించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుల్ షౌకత్, చిన్నయ్య, కానిస్టేబుళ్లు నరేశ్, వజ్రమ్మ, కార్మికశాఖ అధికారి గుప్తా, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా సమన్వయకర్త నల్ల గంగాధర్, సిబ్బంది నరేందర్, లక్ష్మణ్, మమత తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ

ఖానాపూర్: మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి మొదిగెం అశోక్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నాడు. ఉపాధ్యాయురాలు రమ్య, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

కూలిన వంతెన పరిశీలన



వంతెన పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ – రాచాపూర్ గ్రామాల మధ్య ఉన్న సరస్వతికాల్వ పై కూలిన వంతెనను శుక్రవారం నీటిపారుదల శాఖ ఎస్ఈ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన గురించి పలు వివరాలను ఏఈ మధుకర్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఈఈ లక్ష్మీ, డీఈ నరేశ్ తదితరులు ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు సంప్రదించాలి

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల15 స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో నేరుగా సంప్రదించాలని ఆయన సూచించారు.

శ్రేష్ట-2024 ఫలితాల్లో ప్రతిభ

ముధోల్: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి సుశాంత్ మూనేవార్ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శ్రేష్ట-2024లో విడుదల చేసిన ఫలితాల్లో 1300వ ర్యాంకు సాధించాడు. కేంద్ర సామాజిక, న్యాయసాధికారత మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులకు తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి శ్రేష్ట ద్వారా ప్రవేశపరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో సీటు సాధించిన వారికి దేశంలోని ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో విద్య అందిస్తారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ అభినందించారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పక్కన నాయకులు

ఖానాపూర్: భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని గ్రీన్‌ఫిల్డ్ స్టేడియంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయనాల వినియోగం తగ్గించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో 45 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని సత్తన్‌పల్లిలో చికిలిబాయి ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్న సత్యం, నాయకులు కావలి సంతోశ్, దయానంద్, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, అంకం రాజేందర్, పరిమి సురేశ్, తోట సత్యం, పుప్పాల శంకర్, శ్రీనివాస్, మజీద్, వెంకాగౌడ్, లక్ష్మిరాజం, శంకర్, రాజు, సంతోశ్, అశోక్, రాజేశ్వర్, సత్యనారాయణ, గంగాధర్, లక్ష్మిపతిగౌడ్, శేషాద్రి, శోభన్ తదితరులున్నారు.

మామడ: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు.



మామడ: కప్పన్‌పల్లి పాఠశాలలో..

ప్రధానోపాధ్యాయుడు జె.సాయన్న, ఉపాధ్యాయులు హరిహరన్, సట్ల గంగాధర్, గంగారాం, పీడీ క్రాంతి, స్వాతి, హంసలత, వాణి ఉన్నారు.

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీలో వైకుంఠధామం వద్ద యువకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఎఫ్ఏ సాయన్న ఉన్నారు.

సరస్వతీ శిశుమందిర్‌లో వన మహోత్సవం

ముధోల్ : వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో 100 రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో శిరీష, ఈవో అనూష, జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్, ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



బాసరలో మొక్కలతో విద్యార్థినులు

బాసర: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. బాసరలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలతోపాటు హంసవాహిని ప్రైవేట్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తేజస్విని, ఓంకార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

- డీఈవో రవీందర్‌రెడ్డి
- లక్ష్మణచాంద ప్రాథమిక పాఠశాల సందర్శన

సాక్షి స్పందన



కిటికీ పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వసతుల్లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 12న శుక్రవారం సాక్షిలో 'సౌకర్యాల్లేని సర్కారుబడి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈవో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. శిథిలావస్థకు చేరిన భవనం, నిర్మాణం నిలిపివేసిన భవనాన్ని, కిటికీలు, గదులను పరిశీలించారు. సమస్యలను ప్రధానోపాధ్యాయుడు సాయన్నను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మనఊరు– మనబడి కార్యక్రమం కింద నిధులు విడుదల కాక భవన నిర్మాణం నిలిచిపోయిందన్నారు. వెంటనే సమస్యను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. నిధులు మంజూరు చేయించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం డీఈవో పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. వారి వెంట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, ఉపాధ్యాయులు గంగాధర్, అశోక్, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ హాస్టళ్లకు భవనాలు నిర్మించాలి'

భైంసాటౌన్: ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని విద్యార్థి జనసమితి(వీజేఎస్) రాష్ట్ర కార్యదర్శి పి.తులసీరాం డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లు అద్దె భవనాల్లో.. అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే సొంత భవనాలున్న చోట వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీజేఎస్ భైంసా డివిజన్ అధ్యక్షుడు గణేశ్, శక్తిమాన్, నాగేశ్, విక్రమ్, ఆర్యన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేఎల్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావుపటేల్, నాయకులు

భైంసాటౌన్: ఈనెల 24 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన బీజేఎల్పీ సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారెంటీలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేలా కార్యాచరణపై చర్చించినట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వారి వెంట నియోజకవర్గ నాయకులు నారాయణ్‌రెడ్డి, రవిపాండే, గోపాల్‌సర్డా, సాయినాథ్, గంగాధర్, రవి, దిలీప్ తదితరులున్నారు.

మూగజీవాల ఉసురు తీసిన కరెంట్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ డంపింగ్‌యార్డు వద్ద తోటలో ఆవు శుక్రవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గడ్డి మేస్తూ.. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని బాధితుడు చావాం సుదర్శన్ తెలిపాడు. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని పేర్కొన్నా డు.

శివుని గ్రామంలో..

కుభీర్: మండలంలోని శివుని గ్రామంలో ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. చేనులో అరక తిప్పుకునే సందర్భంలో ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ సపోర్ట్ వైరుకు తగలి అక్కడిక్కడే మృతిచెందిందని రైతు దిగంబర్ పటేల్ తెలిపాడు. లైన్ ఇన్‌స్పెక్టర్ మంగిలాల్ చేరుకుని సరఫరాను నిలుపుదల చేశారు. పశువైద్యాధికారి విశ్వజిత్..ఎద్దుకు పంచనామా నిర్వహించారు.

నీటిట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయాలి



మందపల్లిలో క్లోరినేషన్ చేయిస్తున్న అధికారులు

పెంబి: గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మందపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా నీటి ట్యాంక్‌లో బ్లీచింగ్ పౌడర్ వేసి మాట్లాడారు. రోడ్లపై చెత్తాచెదారం, మురుగుకాల్వల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ఉపాధి కూలీలు నాటుతున్న మొక్కలను, పెంబిలో డ్రెయినేజీల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఏపీవో రాజశేఖర్, ఎఫ్ఏలు భూమన్న, గోపి, కార్యదర్శి సుజాత, సిబ్బంది లింగన్న, కూలీలు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



లోకేశ్వరం: మన్మద్‌లో సన్మానిస్తున్న సభ్యులు

సోన్: మండలంలోని సిద్దులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పద్మనాభం, నరేందర్‌కు జ్ఞాపిక అందించి శాలువాతో సన్మానించారు. పాఠశాలలో హెచ్ఎం హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని అక్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు మతిన్, రాజేందర్‌రెడ్డి, నాగరాణిలకు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యార్థులకు యోగా మ్యాట్లను విరాళంగా అందించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంగాధర్, విద్యాకమిటీ మాజీ చైర్మన్ బైరి వెంకన్న, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో పని చేసి పదోన్నతిపై వెళ్లిన శైలజను, కన్కపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రమేశ్, రాజేశ్వర్‌ను ఆయా గ్రామాల్లో వీడీసీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రకాంత్, ఉపాధ్యాయులు దేవేందర్, మల్కాగౌడ్, సాయారెడ్డి, వెంకటరమణ ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో ఫ్రైడే..డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అంతటా తిరుగుతూ..మురికి కుంటలను పరిశీలించారు. నాలాల వెంట పిచ్చిమొక్కలను మున్సిపల్ సిబ్బందితో తొలగింపజేయించారు. ప్రతి శుక్రవారంతో పాటు మంగళవారం కూడా డ్రై డే పాటించాలని సూచించారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, జవాన్ శేఖర్, సిబ్బంది ఉన్నారు.

నీటిసౌకర్యం కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తానూరు: మండలంలోని బెంబర ప్రాథమిక పాఠశాలకు నీటి వసతి కల్పించాలని శుక్రవారం విద్యార్థులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పాఠశాలలో నీళ్ల లేక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం కాలనీలోని నల్లా వద్దకు నీళ్లు తాగేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. నీటి వసతి లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయని వివరించారు.